క్లుప్తంగా

నేడే చివరితేదీ

దామెర : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు పొందేందుకు శనివారం చివరి అవకాశం కల్పిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఒగ్లాపూర్ టీఎస్ఆర్‌డబ్ల్యూ బాలుర(పరకాల) పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగిలిఉన్న సీట్ల భర్తీ కోసం శనివారం చివరి తేదీ అని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 21న నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడిగా సురేందర్

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడిగా కొత్తపల్లి గ్రామానికి చెందిన మండల సురేందర్‌ను నియమించినట్లు హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ శుక్రవారం ప్రకటించారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్, జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ అనితా, జెడ్పీటీసీ రవీందర్ పాల్గొన్నారు.

24గంటల పాటు కరెంట్ అందించాలి

ఎల్కతుర్తి : ప్రభుత్వ ఆదేశాల మేరకు 24గంటల విద్యుత్ సరఫరా అందించాలని రూరల్ డివిజన్ ఇంజనీర్ సామ్యానాయక్ అధికారులకు సూచించారు. శుక్రవారం భీమదేవరపల్లి సబ్‌డివిజన్ పరిధిలో నిర్వహించిన విద్యుత్ అధికారుల సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. వ్యవసాయ రైతులకు 24 విద్యుత్ సరఫరా అందించాలని ఆదేశించారు. గృహజ్యోతి పథకంలో నమోదు కానివారికి సైతం గృహజ్యోతి పథకం వర్తిస్తుందన్నారు. ఎవ్వరూ అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా అప్పుడప్పుడు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీఎఫ్ రాజు, ఏఈలు లక్ష్మణ్‌నాయక్, శిరిష, కుమారస్వామి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



వేలేరు : రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మండలంలోని మల్లికుదుర్ల పాఠశాల విద్యార్థులు ఆశిష్, మణికంఠ ఎంపికైనట్లు హెచ్‌ఎం జయసాగర్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాస్థాయి సబ్ జూనియర్స్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈనెల 23, 24వ తేదీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఆలేరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పీఈటీ సుమలత, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



ఐనవోలు : రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని పున్నేలు క్రాస్ సమీపంలోని ఏకశిల స్కూల్ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పంథిని గ్రామానికి చెందిన నస్కూరి వినోద్ బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. కాగా ఏకశిల స్కూల్ వద్ద ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. వెనుకనే వస్తున్న టాటాఏస్ వాహనం వినోద్ కాలుపై నుంచి వెళ్లింది. ఈ ప్రమాదంలో వినోద్ తలకు తీవ్ర గాయాలు అవడంతోపాటు కాలు ఫ్రాక్చర్ అయ్యింది. చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని స్థానికులు 108 ఆస్పత్రికి తరలించారు.

పోషణ్ పక్వాడాపై అవగాహన సదస్సు



కాజీపేట: కాజీపేట భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) ప్రధాన కార్యాలయంలో శుక్రవారం పోషణ్ పక్వాడ్‌పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సును ఏరియా జనరల్ మేనేజర్ సుమ్మిత్ చక్రవర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ చిరుధాన్యాలతో తయారు చేసిన పలు రకాల వంటకాల్లో ఎక్కువ పోషకాలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో ఏజీఎం ధీరజ్ కుమార్, సునీల్, రవికుమార్, సురేష్, వంశీ, దివ్య తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

హసన్‌పర్తి: అనారోగ్య సమస్యలతో మరణించిన ముచ్చర్లకు చెందిన మట్టెడ సబిత అంత్యక్రియలకు బీఆర్‌ఎస్ నాయకుడు వెంకటేశ్వర్ రెడ్డి ఆర్థిక సాయం చేశారు. ఈమేరకు రూ.3వేలను మృతురాలి కుటుంబ సభ్యులకు శుక్రవారం అందించారు.

కల్యాణలక్ష్మితోపాటు బంగారం ఇవ్వాలి

● హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

కమలాపూర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ విస్మరిస్తోందని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి విమర్శించారు. వివాహమైన ప్రతి ఆడబిడ్డకు కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన నాయకులు ప్రస్తుతం అమలు చేయడం లేదని అన్నారు. మండలంలోని ఉప్పల్‌లో చార్లెస్–మానస దంపతుల పాపను ఆశీర్వదించిన అనంతరం పలు వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గురువారం సాయంత్రం మండలంలోని 62 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారని, తులం బంగారం ఇవ్వకుండా కేవలం రూ.1,00,116 విలువ గల చెక్కులను మాత్రమే అధికారులు అందించడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కల్యాణలక్ష్మి చెక్కులతో పాటు తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ సత్యనారాయణరావు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సంపత్‌రావు, మాజీ ప్రజాప్రతినిధులు నవీన్‌కుమార్, దేవేందర్‌రావు, నాయకులు రాజమౌళి, శ్రీధర్‌రావు, రాజు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

మండలంలోని గుంటూరుపల్లి (దేశరాజుపల్లి) గ్రామంలో బొడ్రాయి, ఆంజనేయస్వామి, భూలక్ష్మీ, మహాలక్ష్మీ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రూ.30 వేలను ఉత్సవ నిర్వహణ కమిటీకి విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శైలజ నాగేందర్, బీఆర్‌ఎస్ నాయకులు తక్కలపల్లి సత్యనారాయణరావు, ఇంద్రసేనారెడ్డి, మారేపల్లి నవీన్‌కుమారి, దాసరి శ్రీనివాస్, ధనాకర్, గ్రామశాఖ అధ్యక్షులు సదయ్య, రాజ్‌కుమార్, శ్రీను, సమ్మయ్య, గ్రామస్తులు హరి, శ్రీను, నర్సింగరావు, రత్తయ్య, సుధాకర్, సురేష్, సత్యం, సుదర్శన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

పెద్దమ్మతల్లి ఆలయానికి గ్రానైట్ బహూకరణ

వేలేరు : మండలంలోని పీచర గ్రామంలో గల పెద్దమ్మతల్లి ఆలయానికి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర ఆదేశాల మేరకు మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, పార్టీ మండల ఇన్‌చార్జ్ మల్కిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి రూ.80వేల విలువగల గ్రానైట్‌ను అందించారు. పెద్దమ్మతల్లి ఆలయ కమిటీ సభ్యులకు అందించగా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీ సంపత్ ,గ్రామశాఖ అధ్యక్షుడు రాజు, సీనియర్ నాయకులు తిరుపతి, వెంకటేశ్, మహేందర్, అనిల్, రాజు, సమ్మయ్య, సంపత్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



గ్రానైట్ అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రభుత్వ వైద్యులపై చర్య తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్‌ఐ ప్రతినిధులు

ఖిలా వరంగల్: ప్రజల సొమ్మును జీతాలుగా తీసుకుంటూ ప్రభుత్వ వైద్యులుగా చెలామణి అవుతూ ప్రైవేట్ క్లినిక్‌లు నడుపుతున్న వైద్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్‌ఐ) జిల్లా కార్యదర్శి డి.సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ ఫోర్ట్‌రోడ్డులో రాష్ట్ర వైద్య మండలి సభ్యుడు, పబ్లిక్ రిలేషన్ చైర్మన్ డాక్టర్ నరేష్ కుమార్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం సాంబమూర్తి మాట్లాడుతూ కాకతీయ మెడికల్ కళాశాల ఆస్పత్రి, ఎంజీఎంలో పనిచేస్తున్న వైద్యులు లక్షలాది రూపాయల జీతాలు తీసుకొని పేదలకు సరైన సేవలు అందించటం లేదని విమర్శించారు. పనిచేసే సమయంలో ప్రైవేట్ క్లినిక్‌లు నిర్వహిస్తూ వైద్యం పేరుతో ప్రజలను దోచుకుంటున్నారని అన్నారు. జిల్లా వైద్య అధికారులు, సూపరింటెండెంట్లు ఉదయం నుంచి సాయంత్రం వరకు డ్యూటీలో ఉండాలని ప్రభుత్వం జీఓ జారీ చేసినా అవేమీ పట్టనట్లుగా వారు వ్యవహరిస్తున్నారని ఎద్దేవాచేశారు. పలువేల్పుల గ్రామానికి చెందిన పసునూరి దేవేందర్ మృతికి కారణమైన కేఎంసీ యూరాలజీ డాక్టర్ రణధీర్‌రెడ్డిపై విచారణ జరిపి చర్య తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి తిరుపతి, సభ్యులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభాకర్‌గౌడ్

ఖిలా వరంగల్: మహిళల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని కాంగ్రెస్ నేత కరాటే ప్రభాకర్ గౌడ్ అన్నారు. మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ఆదేశాల మేరకు వరంగల్ శివనగర్‌లోని భూపేష్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో కాంగ్రెస్ నేత చిట్టిమల్ల శ్రీనివాస్‌రావు, డివిజన్ అధ్యక్షురాలు పొనకంచి కృష్ణకుమారి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ మహిళా కార్యకర్తల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మహిళా కార్యకర్తలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పంచరాణి సంతోషి, బొశెట్టి వెంకటేశ్వర్లు, శెట్టి రాజేష్, పద్మ, మాధవి, కోతి స్వరూప, బేతి ఉమామహేశ్వరి, పసునూరి ప్రేమలత, స్వప్న, కల్పన, కవిత, పూర్ణిమ, లత, లక్ష్మి, రమ, మంజుల, పద్మ, అనిత, వరలక్ష్మి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యమే రైతులకు మహాభాగ్యం



మొండ్రాయిలో గేదెలకు టీకా వేస్తున్న రాజు

సంగెం: పశువులు ఆరోగ్యంగా ఉంటేనే రైతులు ఆనందంగా ఉంటారని మండల పశువైద్యాధికారి డాక్టర్ వల్లే రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని మొండ్రాయి, గొల్లపల్లి గ్రామాల్లోని పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు ఎప్పటికప్పుడు పశువైద్యుల సలహాలు, సూచనలు పాటించి పశుసంపదను కాపాడుకోవాలన్నారు. పరిశుభ్రమైన వాతావరణంలో వాటిని పెంచాలని చెప్పారు. గోపాలమిత్రలు కమలాకర్, బాబు, జితేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

హసన్‌పర్తి: ప్రపంచ జల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈమేరకు హసన్‌పర్తి మండల కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు వినూత్న ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఆకుతోట రాంబాబు మాట్లాడుతూ సకల చరాచర జీవకోటికి నీరు ప్రాణధారం అన్నారు. నీరులేక జీవకోటి మనుగడ లేదని వివరించారు. ఈక్రమంలో ప్రతీనీటి బొట్టును ఒడిసి పట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉప ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



‘ఆటో బతుకులు’ సీరియల్‌ను ఆదరించాలి



కాశిబుగ్గ: ఆటో డ్రైవర్ల పరిస్థితి, వారి జీవితాల ఆధారంగా రూపొందించిన ‘ఆటో బతుకులు’ సీరియల్‌ను ఆదరించాలని సీరియల్ హీరో మంద రవికుమార్ పిలుపునిచ్చారు. హీరో తెలంగాణ ఆటోడ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఓసిటీలో సీరియల్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలో ఆటోడ్రైవర్ల పరిస్థితి బాగాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం రూ.వేయి కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆటో డ్రైవర్లకు నెలకు రూ.15 వేల చొప్పున ఆటో బంధ్ పథకం కింద ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



కాజీపేట అర్బన్: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా హనుమకొండ లష్కర్‌బజార్‌లోని శిశుగృహ, కళాశాల ఎట్ హోమ్ ప్రాంగణంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని సామూహిక సీమంతాలు, అన్నప్రాసన చేశారు. అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, జిల్లా సంక్షేమాధికారి మధురిమ పాల్గొన్నారు.

మసీదులో ఇఫ్తార్ విందు



హన్మకొండ చౌరస్తా: హనుమకొండ కుమార్‌పల్లి మార్కెట్ ఎదురుగా ఉన్న మర్కజ్ మసీదులో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరయ్యారు. ముస్లిం మతపెద్దలతో కలిసి ఎమ్మెల్యే ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు.

కాంగ్రెస్‌లో చేరిక

సంగెం: మండలంలోని బీకోజీనాయక్ తండాకు చెందిన వార్డు సభ్యులతో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. శుక్రవారం హనుమకొండలోని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి స్వగృహంలో మాజీ సర్పంచ్ బానోత్ విద్యావతి కుమారుడు వంశీతో వార్డు సభ్యులు గుగులోత్ రాజు, బానోతు బిచ్చా, పార్టీ గ్రామ అధ్యక్షుడు భూక్య వీరన్న, నాయకులు రవీందర్, తిరుపతి, అభిలాష్, చంటి తదితరులకు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

ముగిసిన క్రీడా పోటీలు

రామన్నపేట: నగరంలోని ఎల్‌బీ కళాశాలలో స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ శుక్రవారం ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపల్ అరుణ డీహెచ్.రావు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో బాస్కెట్ బాల్, కబడ్డీ, అథ్లెటిక్స్ (పురుషులు, మహిళల) పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నిరంజన్, సెక్రటరీ ఈ.రాజేందర్, ట్రెజరర్ ఆనంద్, వైస్ ప్రిన్సిపాల్ కె.రాజేందర్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ బి.ప్రభాకర్, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు సత్యనారాయణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

కేయూ లైబ్రరీలో తాగునీటి సమస్య

కేయూ క్యాంపస్: యూనివర్సిటీలోని లైబ్రరీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో యూనివర్సిటీలోని లైబ్రరీని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైబ్రరీలోని ఫ్రిజ్‌లో నీరు అందుబాటులో ఉండడం లేదని అన్నారు.

ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలి



నెక్కొండ: ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలని ముదిరాజ్ సంక్షేమ సంఘం మండల నాయకులు అన్నారు. ముదిరాజ్‌లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుపై వారు సీఎం రేవంత్‌రెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చిత్రపటాలకు మండల కేంద్రంలోని తెలంగాణ సెంటర్‌లో శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజాపాలన దిశలో ముందుకు సాగడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దుండి రవి, యాట ఉప్పలయ్య, చొప్పరి దూడయ్య, వాకిటి సమ్మయ్య, దుండి రాజు ముద్రబోయిన శ్రీకాంత్, పెండ్యాల రాజశేఖర్, దుర్గాల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

నీటి పొదుపుతోనే భావితరాలకు భవిష్యత్

వేలేరు : నీటి పొదుపుతోనే భావితరాలకు భవిష్యత్ ఉంటుందని బాలవికాస సంస్థ కోఆర్డినేటర్ మధుసూదన్ అన్నారు. మండలంలోని పీచర ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం బాలవికాస వాటర్‌ప్లాంట్ ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనిషికి ప్రాణధారమైన నీటిని వృథా చేయకుండా పొదుపుగా ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఎంపీటీసీ సంపత్, వాటర్‌ప్లాంట్ అధ్యక్షుడు సిద్ధయ్య, కార్యదర్శి నాగరాజు, కోశాధికారి లక్ష్మీనారాయణ, హెచ్‌ఎం శ్రీదేవి, ఇన్‌చార్జ్ వేణుగోపాల్, కార్యవర్గ సభ్యులు రాజు, రాజేశ్వరరావు, రవి, ఆపరేటర్ ఆగయ్య తదితరులు పాల్గొన్నారు.



బహుమతి అందజేస్తున్న ప్రతినిధులు

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఎన్నిక




కమిటీ సభ్యులతో ఉపాధ్యాయులు

ఐనవోలు : మండలంలోని ఉడుతగూడెం, ఐనవోలు ప్రాథమిక పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను శుక్రవారం ఎన్నుకున్నారు. ఉడుతగూడెం మహిళా సంఘాల అధ్యక్షురాలు బరిగెల సుమలత చైర్ పర్సన్‌గా, పాఠశాల హెచ్‌ఎం చుంచుకాల లింగారావు కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. ప్రతీ తరగతి నుంచి పిల్లల తల్లులు మహిళా సంఘ సభ్యులైన వారిని ముగ్గురు చొప్పున ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా చిదురాల మమత, మిద్దెపాక రజిత, ఇల్లందుల భారతి, చిలుముల సుమ, ఇల్లందుల రేణుక, యాకర ప్రియాంక, ఆకులపల్లి రజిత, తాటికాయల రజితను ఎన్నుకున్నారు. ఐనవోలులో వీఓ అధ్యక్షురాలు నల్లబెట్ట అనిత చైర్‌పర్సన్‌గా, హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి కన్వీనర్‌గా ఎన్నికకాగా.. మిగిలిన 13 మంది సభ్యులను ఎస్సీ, ఎస్టీ కోటా, మహిళ సంఘాల సభ్యురాళ్లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రతికంఠం ఉమాదేవి, బీమళ్ల సారయ్య, మధుకర్, మహేందర్‌రెడ్డి, మహేందర్, లక్ష్మయ్య, సీఆర్‌పీలు రేవతి, రాజ్‌కుమార్, ఐఆర్‌ఈపీ భవన్, ప్రణీత, రాధిక, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లలో సౌకర్యాలు కల్పించాలి

నడికూడ : పోలింగ్‌స్టేషనల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆర్డీఓ నారాయణ సూచించారు. మండలంలోని పులిగిల్ల, చర్లపల్లి, నార్లపూర్, వెంకటేశ్వర్లపల్లి గ్రామాల్లోగల పోలింగ్‌స్టేషన్లను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలింగ్‌స్టేషన్‌లో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, ఇతర సౌకర్యాలపై అధికారులకు సూచించారు. తాగునీరు, ర్యాంపులు, ఎండాకాలం దృష్ట్యా టెంట్లు ఏర్పాటు చేయాలని అన్నారు. వృద్ధులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నడికూడ తహసీల్దార్ నాగరాజు, పరకాల తహసీల్దార్ భాస్కర్, హేమనాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ

మొక్కలను సంరక్షించాలి : ఎంపీడీఓ

కమలాపూర్ : గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలను కాపాడాలని ఎంపీడీఓ గుండె బాబు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని కానిపర్తి, దేశరాజపల్లి, కన్నూరు, గుండేడు, మర్రిపల్లిగూడెం, వంగపల్లి, పంగిడిపల్లి గ్రామపంచాయతీల్లోని నర్సరీలు, ఉపాధి హామీ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రతి నర్సరీలో నూరుశాతం జర్మినేషన్ ఉండే విధంగా చూడాలని అన్నారు. పూలు, పండ్ల మొక్కలతోపాటు రోడ్డుకు ఇరువైపు నాటే మొక్కలను కూడా తప్పసరిగా పెంచాలని సూచించారు. ప్రతి నర్సరీలో నైపుణ్యం కలిగిన వనసేవకులను నియమించుకొని ఉదయం, సాయంత్రం మొక్కలకు నీటిని అందించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు తప్పనిసరిగా నర్సరీలను పరిశీలించాలని అన్నారు. మండల స్థాయి సిబ్బంది వారానికి ఒక్కసారైనా నర్సరీలను సందర్శించి రిజిష్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. అలాగే ఉపాధి హామీ పనులకు ప్రతి గ్రామంలో కనీసం 100 మంది కూలీలకు పని కల్పించాలని, వారికి కనీస వేతనం రూ. 272 వచ్చే విధంగా కొలతలు మార్క్‌అవుట్ చేయాలన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రతి గ్రామంలో తప్పనిసరిగా 250 మంది కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులు, ఏపీఓ, పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

మధ్యాహ్న భోజనం పరిశీలన

మండలంలోని కన్నూరు, వంగపల్లి గ్రామాల్లోని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీఓ గుండె బాబు సందర్శించి చిన్నారులకు అందించే మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. చిన్నారులకు మెను ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు ఏమైనా భోజన సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. మధ్యాహ్న భోజనంలో వడ్డించే ఆహార పదార్థాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆత్మకూరు : మండలంలోని అక్కంపేటలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పాడనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రవికుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ మెయింటనెన్స్ కారణంగా సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఐనవోలు : మండలంలోని ఒంటిమామిడిపల్లి, కక్ట్యాల, ఉప్పరపల్లి 11 కేవీ అగ్రికల్చర్ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం సాయంత్రం 4.30 గంటల నుంచి 6.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇన్‌చార్జ్ ఏఈ శివకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒంటిమామిడిపల్లి, పంథిని, నందనం గ్రామాలతో పాటు వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లి గ్రామ చుట్టుపక్కల ప్రాంతాల్లో వ్యవసాయ కనెక్షన్‌లు కలిగిన రైతులు సహకరించాలని కోరారు.

నడికూడ : మండల కేంద్రంతో పాటు నర్సక్కపల్లి గ్రామంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏఈ విశ్వప్రసాద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 11 కేవీ విద్యుత్తు లైన్ల మరమ్మతు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు సరఫరా ఆయన నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వేలేరు : పీచర సబ్‌స్టేషన్ పరిధిలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మరమ్మతుల కారణంగా శనివారం సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు త్రీఫేజ్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ కుమారస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సింగిల్ ఫేజ్ విద్యుత్ సరాఫరా ఉంటుందని తెలిపారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

దామెర : ఎన్నికల నియమావళిని ప్రతిఒక్కరూ పాటించాలని ఎస్సై అశోక్ కోరారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని హైదరాబాద్–భూపాలపట్నం జాతీయ రహదారిపై పోలీస్ సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. ఎస్సై మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలని అన్నారు. 50వేలకు మించి డబ్బులు తరలించొద్దని అన్నారు.